

# ప్రయాణం

-ముడుంబి విద్యాసాగర్

బస్సు కిటకిటలాడుతూంది. నిలబడడానికికూడా సరిగా చోటు లేదు. పై మెటల్ బార్ పట్టుకొని సత్యం వేలాడుతున్నాడు. రాత్రంతా ప్రయాణం చేయాలి. నిద్ర పోవడానికి ఎలాగా అవకాశం లేదు. బస్సులో కూర్చోవడానికేనా కాస్త చోటు దొరికితే బాగుండు ననుకున్నాడు. అర్జెంటుగా హైదరాబాదు పోవలసి వచ్చింది. కండక్టరుని బ్రతిమాలి బస్సులో దూరాడే కాని, నిద్ర ఆపుకోవడం కష్టమై పోతూంది.

బస్సు కుదుపు ఉన్నా, కూర్చునే స్థలం లేకపోయినా నిద్ర మాత్రం ముంచుకు వస్తూంది. రెయిలింగ్ పట్టు వదిలి అమాంతం పడిపోతానేమో అనే భయం. బెజవాడ చేరేసరికి ఇద్దరు దిగడం వల్ల కూర్చోవడానికి చోటు దొరికింది. 'అమ్మయ్య' అనుకున్నాడు.

బెజవాడలో దిగే ప్రయాణీకులు దిగుతుండగానే ఎక్కేవాళ్లు తోసుకుని ఎక్కుతున్నారు. మత్తుగా బయటికి చూస్తున్న సత్యానికి, చంటిపాపను ఎత్తుకు



"బరకగా ఉండే పాత కాలపు పళ్ల పొడులు మీ చిగుళ్లకు పళ్లకు చెరుపు చేస్తాయి...!"




కాల్గేట్ టూత్ పౌడరుతో మీ చిగుళ్లను, పళ్లను కాపాడుకోండి. చెడు శ్వాసను అరికట్టండి !

కాల్గేట్ టూత్ పౌడరుతో ఆధునాతన దంత సంరక్షణ పొందుపైనది— దాని చల్లని ఉల్లాసకరమైన రుచిని మీరు ఎంతో మెచ్చుకుంటారు! మీ కుటుంబం కోసం ఈ నాడే ఒక డబ్బా కొనండి!

TP G. 20. 71


బస్సెక్కుతూ వసంత కనపడగానే నిద్ర వదుల్చుకుని, కళ్లు నులుముకుని మరీ చూశాడు. సీటుమీద రుమాలు పడేసి, పక్క అతనితో చెప్పి చివుక్కున లేచి పెట్టె అందుకున్నాడు. తన సీటు తప్ప వేరే కూర్చునేందుకు చోటు లేదు. వాళ్లాయన కాబోలు— "చంటి దానితో ప్రయాణం చేస్తూంది. కూర్చోవడానికి చోటు లేదే" అని ఇదవుతున్నాడు. సామానందుకున్న సత్యాన్ని ఇత నెవరా అని సందేహంగా చూశాడు. "ఈయన పేరు సత్యం. మా ఇంటి దగ్గరే ఉండేవారు హైదరాబాదులో" అని పరిచయం చేసింది వసంత. తను మూడు గంటల నుంచి వేచి, చూసి, సంపాదించిన సీటు నిస్సంశయంగా వసంత కర్పించి మళ్లీ నిలబడ్డాడు సత్యం. కిటికీ కవతల నిలబడి ఏవేవో అప్పగింతలు చెప్పి బస్సు కదిలాక వెను దిరిగాడు వసంతా వాళ్లాయన. వసంత పక్కన కూర్చునేందుకు చోటుంది. కాని, సంశయిస్తూ నిలబడి పోయాడు సత్యం. "ఎంతసేపని నిలబడతారు? ఫరవా లేదు కూర్చోండి" అని పక్కకు ఒదిగింది వసంత.

బస్సులో ఉన్నవాళ్లంతా ఏదో ఒక విధంగా కునుకు తీస్తున్నారు. లైట్లు మసకగా వెలుగుతున్నాయి. బస్సు ఒకటే రొద, కుదుపూను. నిద్ర మాయమయింది... ఎన్నాళ్లయింది వసంతను చూచి! చిన్నప్పటినుంచీ ఒకే పేటలో పెరిగినందువల్ల ఒకరి గురించి ఒకరికి బాగా తెలుసు. ఒకరంటే ఒకరికి సదభిప్రాయం ఉంది. కాని, మాట్లాడుకోవడం అలవాటు లేదు. తన చెల్లెలికోసం తరుచు ఇంటికి వస్తూండేది. పసితనంలో వారి పరిచయంలో చెప్పుకోదగిం దేమీ లేదు. కాని, ఒక రోజు స్మృతి మాత్రం సత్యం మెదడులో అప్పుడప్పుడు మెరుపులా వస్తూ ఉంటుంది.

ఆవేళ సాయంత్రం కాలేజీనుంచి ఇంటికి వచ్చి వాకిట్లో కూర్చొని పేపరు తిరగేస్తున్నాడు. తలుపు ఓరగా వేసి తల్లీ, చెల్లెలూ పేరంటానికి వెళ్లారు. ఇంట్లో ఇంకెవ్వరూ లేరు. తెరిచిన తలుపు తోసుకుని వసంత లోపలికి వచ్చింది. తెల్ల సిల్కుచీర, పాలతెలుపు పట్టు జాకెట్టు. జరీఅంచు మెరుపులో వెలుగుమూర్తిలా ఎదురుగా నిలుచుంది. పేపరు పక్కకు తీసేసరికి కోలనా, గుండ్రమూ కాని తెల్లని ముఖం, నల్లని ముంగురుల నడుమనుండి సన్నగా నవ్వే గాజు బుగ్గలు తళుక్కు మన్నాయి. "ఇంట్లో ఎవరూ లేరా?" అని అడిగింది. 'ఎంత అందంగా ఉంది ఈ అమ్మాయి!' అనుకుంటున్న సత్యానికి జవాబు వెంటనే స్ఫురించలేదు. "ఎంత పరధ్యానమండీ మీకు! ఇంట్లో ఎవరూ లేరా?" అని రెట్టించింది వసంత. 'పరధ్యాన మేమిటి?' సత్యానికి నవ్వు వచ్చింది. వాళ్లు ఇంట్లో లేరని తెలుసుకుని, మళ్లీ వస్తానని చెప్పి గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్లిపోయింది వసంత. ఆ రోజు ఆ గొంతు మృదుత్వం, పోయిన తీరు— ఇన్నాళ్లకు వసంతను చూస్తే కళ్లకు కట్టినట్లు మళ్లీ జ్ఞాపకం వచ్చాయి. అయినా, 'ఆ వసంతే ఈ వసంతా?' అనుకున్నాడు, పక్కన అప్పుడే కనులు మూతలు పడు తున్న వసంతను చూచి. అనారోగ్యం వల్ల కాబోలు మొగంలో అందం తగ్గింది.

'ఆడవాళ్లు పెళ్లిళ్లు చేసుకోకూడదు' అనుకున్నాడు. 'కాని, ఆడవాళ్లు పెళ్లి చేసుకోకుంటే అసలు పెళ్లి ఎలాగు? ఇలాటి మతిలేని ఆలోచన లెందుకు వస్తాయి?' నవ్వు వచ్చింది.

మనసు మరేదైనా ఆలోచించగలిగితే బాగుండు






స్థాపితం: 1957 ఫోన్ నెం: 20178

మీరు మీ ఇంటియందుండే తపాలా మూలముగా చిత్రకళ నేర్చి రెండు సంవత్సరము లలో ఉత్తమ చిత్రకారులు కావచ్చును.

తెలుగు, తమిళం, మలయాళం, ఇంగ్లీష్ లలో మీకు వచ్చిన భాషలో పాఠములను పొంది శిక్షణ పొందవచ్చును. యావద్భారత దేశము నుండియు విదేశముల నుండియు అనేకమంది మా విద్యాలయంలో విద్యార్థులుగా చేరి శిక్షణ పొందుచున్నారు.

వివరముల కొరకు 6 పది పైసల స్టాంపులు పంపండి.

SANTHANU'S CHITIRA VIDYALAYAM,
C/o CHITRAKULLAN, MADRAS-2.


నసుకున్నాడు. అంత ముంచుకు వచ్చిన నిద్రే మాయ మయింది. కూర్చున్నందు కేమీ మనస్సు సమాధాన పడలేదు. లేచి నిలబడదామన్నా ఎంతసేపు నిలబడ గలడు? వసంత మాత్రం నిశ్చింతగా పాపను పొదివి పట్టుకొని కళ్ళు మూసుకుంది. తను పక్కను కూర్చో వడం ఆమె కేమీ ఇబ్బందిగా ఉన్నట్లు లేదు. ఓరగా పడ్డ తన చూపుకి, ఆ సన్నటి వెలుగులో ఆమె మంగళ సూత్రం తళుక్కుమంది. గిరుక్కున చూపు మళ్ళించు కున్నాడు. తా నెంత దుర్బల మనస్కుడు! ఆమెను గురించి తప్ప ఇం కేమీ ఆలోచన రావటం లేదు. కళ్ళు మూసు కుని సర్దుకుని కూర్చున్నాడు. హోరుమని కిటికీలోంచి గాలి కొడుతూంది. మాటిమాటికి బస్సు ఎత్తి కుదే స్తూంది. ఇం కెప్పుడూ బస్సులో దూరాలు ప్రయాణం చేయకూడదు. గాలికి రేగిన ఆమె ముంగురులు తన ముఖంపై నాట్యం చేస్తున్నాయి. చేతితో తొలగిస్తే ఆమెకు మెలకువ వచ్చి ఏమనుకుంటుందో ఏమో? ఎంత అలసట ఉంది ఆమె ముఖంలో! ఆడవాళ్ళ పుట్టడంలోనే కష్టముంది. ఎవ్వరూ పూర్తిగా మెచ్చని, పూర్తిగా గ్రహించలేని, మగవాళ్ళు పంచుకోలేని, అర్థం చేసుకోలేని సమస్య లెన్నో! బలహీనమైన ఆమె ముఖంలో ఎంతో సహనం, గాంభీర్యం ఉన్నాయి. మనసులో ఆమె పట్ల జాలీ, ప్రేమా నిండిపోయాయి. ఈ అమ్మాయేనా మెరుపులా, నాజూకుగా, చలాకీగా ఉండేది? అన్ని సౌందర్యాలలాగే స్త్రీ సౌందర్యంకూడా ఒకానొక క్షణం, ఒకానొకరిని ఆశ్రయించుకుని మరులిప్తలో మాయ మవుతుంది. అది తెలిసినా, మోహంనుండి ఎవరు తప్పించుకొనగలరు?

మెలకువ వచ్చి, తన చూపుకి మౌనంతో సమాధానం చెప్పి ముంగురులు సర్దుకుని మళ్ళీ కళ్ళు మూసుకుంది వసంత. ఆమె కదలిక మళ్ళీ తనలో అలజడి రేపింది. క్రిందికి దింపిన చూపులకు చంద్రబింబంలా చంటిపాప ముఖం కనపడింది. మూడు మూర్తులా తల్లి పోలిక. నల్లటి పట్టులాంటి జుట్టు, తెల్లని గుండ్రని ముఖం, పాలబుగ్గలలో వసంత బుగ్గల మెరుపు దింపుకొంది.

తన నిద్ర మటుమాయమై నిటారుగా కూర్చు న్నాడు సత్యం. నిద్రకు లొంగిపోయి తల అతని భుజంపై ఆన్చి నిశ్చింతగా నిద్ర పోతూంది వసంత. కదలడానికి, మెదలడానికి అవకాశం లేదు. కుదుపుకి

**చిన్ననాటి స్నేహం హృదయంలో లతలా అల్లుకొని పెనవేసుకోవడం సహజమే. ఆ స్నేహ స్మృతులు ఏ రైలు ప్రయాణంలోనో ప్రత్యక్ష మయితే యౌవ్వనం అల్లుకున్న కోర్కెల పడుగు పేకల ఆలోచనలు పరీక్షకు నిలబెడితే నిలబడగలడా?**

చేతిలోని బిడ్డ జారిపోతుందేమో అని దిగులు పడ్డాడు సత్యం. కాని, నిద్రలోకూడా పాపను గట్టిగా పొదివి పట్టుకుంది వసంత. చిర పరిచయం ఉన్న ఆ అందమైన అమ్మాయి అతి సమీపంగా, నిశ్చింతగా భుజంపై తల ఆన్చి నిద్ర పోతుంటే సత్యం మనసులో రేగిన తుఫానుకు ఎవరు తప్పు పట్టగలరు? 'నా చెల్లెలు వంటిది వసంత' అని తనను తాను వారించుకున్నాడు.



ఆమె చెక్కిలిపై చేయి ఉంచి సమాదరించాలని బలమైన కోర్కె. పక్కకి తొలగి పోవాలనుకొన్నాడు. కాని తనను ఆనుకున్న వసంత తూలిపోతుందేమో అని భయం. ఒక్క కుదుపుతో వసంత మళ్ళీ సర్దుకు కూర్చుంది. "మీరు నిద్ర పోలేదా?" అన్నది ఓరగా చూస్తూ. 'ఎలా సంభవం?' అనుకున్నాడు సత్యం. తల అడ్డంగా తిప్పి ఊరుకున్నాడు.

బస్సు ఎక్కడా ఆగకుండా దొర్లుకుపోతూనే ఉంది. తన మీదకు జారిన ఆమె చెయ్యి ఎంత అందంగా ఉంది! నల్లని తన చేతితో పోల్చుకుంటే తన చేతిమీద తనకే కోపం వచ్చింది. అమాంతం లేత గులాబిలాంటి ఆమె చేతిని రెండు చేతులలోనూ తీసుకుని కళ్ళకద్దుకుందా మనుకున్నాడు. బస్సురొదా, బస్సులో వాళ్ళూ, వసంత కూతురూ, బస్సులో వెలుగుతున్న గుడ్డి దీపం, బస్సు లైటు వెలుతురులో ఎదురుగా వెండిలా మెరుస్తున్న రోడ్డూ-అన్నీ అడ్డు పడకపోతే అంత పనీ చేసేవాడేమో?

దూరంగా పట్నం కనపడుతూంది. చీకట్లు తొలగిస్తూ తూర్పు దిక్కు ఎరుపులు చిమ్ముతూంది. హైదరాబాదు సమీపించిన కొద్దీ సత్యం మనస్సు కుదుటబడింది.

బస్ దిగి నిలబడింది వసంత పేవ్‌మెంట్‌మీద. చంటిపాప నెత్తుకొని నిలబడ్డ వసంత ఉదయకాంతిలో స్వచ్ఛంగా, హుందాగా, అందంగా ఉంది. కోర్కెల నుండి హృదయాన్ని ఉదయకాంతిలో ప్రేమతో ప్రక్షాళనం చేసుకున్న సత్యం నిర్భీతిగా, నిర్మలంగా, అభిమానంతో చూశాడు వసంతను. ఆదర్శపు ఔన్నత్యం నుండి మనసును పతనం కానీయకూడదనే నిరంతర యత్నం సత్యానిది. సహజంగా హృదయౌన్నత్యమున్న వసంతకు ఈ ఘర్షణలూ, అలజడులూ అనుభూతికి దూరాలు. సోదరుడిని, స్నేహితుడిని పలకరించినట్లు పలకరించింది వసంత.

"మళ్ళీ ఎప్పుడు దర్శనం? ప్రయాణంలోనేనా" అని అడిగింది.

'జీవితమే ఒక ప్రయాణం. ఈ ప్రయాణంలోని అందమైన అనుబంధాల స్మృతులే జీవితానికి మిగిలేవి' అనుకున్నాడు, చిరునవ్వుతో జవాబు చెప్పిన సత్యం.

*